ఆదివారం

ప్రజాశక్తి

మే 18, 2003

హ్యాపీ బర్త్‌డే

(18-5-2003 నుండి 24-5-2003 వరకు)

హర్షిణి
3॥సం, మే-2000
సంధ్యారాణి-వెంకటాచారి
పోతనబమ్మెర -వరంగల్

ఎస్. రాకేష్‌మిత్రా
1॥సం, 18. 5. 2002
రాధిక-రామరాజు
బాపట్ల

పి.అఖిల
4॥సం, 20. 5. 1999
లత- సుందరబాబు
శృంగవృక్షం-ప॥గో॥

జి.అనిల్‌కుమార్
4॥సం, మే- 1999
శ్రీలక్ష్మి-రవికిషోర్
శనివారపుపేట-ఏలూరు

అనూష
8॥సం, మే- 1995
అరుణ- వెంకటేశ్వరరావు
నరసాపురం- ప॥గో

బి.రవితేజ
3॥సం, 20. 5. 2000
భారతి- అప్పనాయుడు
రేగిడి ఆమదాలవస- శ్రీకాకుళం

సిహెచ్. చందు
3సం॥, 20.5.2000
జోస్‌మేరీ- జగన్మోహనరావు
ఘంటసాల-కృష్ణా



పి.వెన్నెల (లోకేశ్వరి)
2॥సం, 20. 5. 2001
సుశీల- వెంకటేష్ (సర్పంచ్)
శాతాపురం-వరంగల్



దీప్తిమౌనిక
6॥సం,22. 5. 1997
రాజేశ్వరి- యలమందయ్య
ఎన్ఎస్‌పి క్యాంప్-ఖమ్మం



మనోజ్‌కుమార్
మే- 22
బంగారమ్మ-రాజునాయుడు
ఎకెసి కాలని-విశాఖపట్నం



లోపాలు వున్న అద్దాల వల్ల వాటిని ధరించినపుడు వస్తువుల రూపు రేఖల్లో తేడాలు, వంకరటింకరగా కనపడటం, ఒకటి రెండుగా గోచరించడం, తలనొప్పి, అలలుగా కనిపించడం, మనకగా ఉండటం మొదలైన అనేక దోషాలు కలుగుతాయి. అందువల్ల ఇవన్నీ లేని సక్రమమైన అద్దాలనే వినియోగించాలి. అద్దాలలో ఎదుటి దృశ్యంతో పాటు పక్క చూపు కూడా బాగా ఉండాలంటే ఏస్పెరికల్ గ్లాసులు ధరించాలి. కాని వీటి ఖరీదు ఎక్కువగా ఉంటుంది.

అద్దాలతో పాటు కళ్ళజోడు ఫ్రేమ్ కూడా మంచిది ఎంచుకోవాలి. ఎక్కువ పెద్ద సైజు, మరీ చిన్న సైజు ఉండకూడదు. తేలికగా ఉండే షెల్ ఫ్రేములు, ఫైబర్ ఫ్రేములు వాడటం మంచిది. మెటల్ ఫ్రేమ్‌లు బరువు ఎక్కువ ఉంటాయి. అంతేకాకుండా వీటి వినియోగం వల్ల ముక్కు, కంటి కింది భాగంలో, చెవుల పైనా చర్మం ఎక్కువగా ఒరుసుకుపోతుంది. దీనివల్ల శరీరంపై ఎలర్జీ రావడం, ఫ్రేములు వంగిపోయి చూడటానికి బాగుండవు.

చిన్నపిల్లలు, విద్యార్థులు, యువతీ యువకులు కూడా కూలింగ్ గ్లాసులు వినియోగించవచ్చు. కళ్ళజోడు నేటితరంలో ఒక ఫ్యాషన్‌గా మారడంతో ఎలాంటి వారైనా కూలింగ్ గ్లాసులు ఉపయోగించడం మంచిది. కళ్ళకు రక్షణ ముఖ్యం కాబట్టి మహిళలు సైతం సిగ్గుపడకుండా వేసవి కాలంలో కళ్ళజోడు వినియోగించడం తప్పనిసరి.

ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా కళ్ళజోడు వినియోగించాలి. దుమ్ము, ధూళి పడకుండా రక్షణగా వుండటమే కాకుండా కళ్ళు చిట్లించకుండా బాగా తెరచి ఎదురు గాలిని తట్టుకుంటూ, ఇతర వాహనాలను గమనిస్తూ క్షేమంగా బండిని నడిపించవచ్చు. ఇన్ని రకాల ఉపయోగాలు ఉండటం వల్ల ఈ రోజుల్లో కూలింగ్ గ్లాసులు అనేకమంది వినియోగిస్తున్నారు. అయితే ఎంపిక చేయడంలో శ్రద్ధ చూపితే కళ్ళు సురక్షితంగా, సమర్థవంతంగా పని చేస్తాయి. ◆

అతిసార నియంత్రణకు కూర అరటి

కాయగూరలు, పప్పు ధాన్యాలు, దంపుడు బియ్యం, వాటిలో గల పీచు పదార్థాలు జీర్ణకోశానికి ఎంతో లాభం చేకూర్చాయి. ఈ దృష్ట్యా కూర అరటి లేదా పెక్టిన్ తరచు అతిసారంతో బాధపడుతున్న పిల్లలకు వ్యాధి వరిహారంగా ఎంతవరకు ఉపయోగపడుతుందన్న విషయంపై వైద్యరంగ పరిశోధకులు అంచనా వేశారు.

అతిసారతో బాధపడు తున్న 5 - 12 సంవత్సరాల మధ్య గల 62 మంది పిల్లలలో కొంతమందికి దంపుడు బియ్యంతో వండిన ఆహారంలో 250 గ్రాముల పచ్చ అరటి లేదా 4 గ్రాముల పెక్టిన్ కలిపి లేదా బియ్యం వండిన ఆహారం వారం రోజుల పాటు ఇచ్చారు. ఆ పిల్లలకు రోజూ 54 కేలరీల శక్తి లభించేలా చర్యలు తీసుకున్నారు.

ఈ ప్రక్రియ అద్భుత పనితీరును ఇచ్చింది. 60 శాతం మంది పిల్లల విరోచనాలలో వ్యాధికారక సూక్ష్మజీవి అదృశ్యమయ్యింది. 10 శాతం మందికిగాను 5 శాతం మందిలో కలరాకారక సూక్ష్మక్రిములు, 4 శాతం మందిలో గ్రూప్ బి పేరా టైఫాయిడ్‌కారక క్రిములు, ఒక శాతం మందికి డయేరియా వ్యాధికారక క్రిములు వున్నట్లు పరీక్షలలో తేలింది. మూడురోజుల చికిత్స అనంతరం పెక్టిన్ లేదా అరటి పండు ఆహారంగా తీసుకున్న పిల్లలలో అతిసారం అదుపు కావడమే కాదు పూర్తిగా నయమైంది.

కాబట్టి తరచు అతిసారంతో ఆసుపత్రిపాలైన పిల్లలకు పచ్చి అరటి లేదా పెక్టిన్ ఆహారంగా ఇస్తే అతిసారం తగ్గుతుందని, ఈ చికిత్స ఇంటివద్దనే చేయవచ్చని పరిశోధనలో వెల్లడయింది. ఈ పరిశోధన బంగ్లాదేశ్‌లో చేయబడింది. ఈ వైద్యాన్ని విస్తృతంగా చేశారు.

పిల్లలలో 14 రోజులకు మించి రోజూ హెచ్చుగా విరోచనాలు అవుతుంటే దాన్ని నిరంతర అతిసారం అంటారు. పోషకాహార లోపం, తిన్న ఆహారం ఇమడకపోవడం, ఎదుగుదల వైఫల్యం తదితర అంశాలతో అతిసార వ్యాధి ముడిపడి వుంది. ఈ అతిసారం వర్ధమాన దేశాలలో విస్తారంగా వుంది. ఈ దేశాలలో తీవ్రమైన అతిసారం కేసులలో 8 శాతం నిరంతర అతిసార కేసులుగా తయారవుతుంటాయి. ఈ రకమైన అతిసారంకు కారణాలు ఇంతవరకు కనుగొనలేకపోయారు. రోగకారక సూక్ష్మక్రిముల స్వభావం అర్థం చేసుకోలేకపోవడం, సంతృప్తికరమైన చికిత్స లభించకపోవడంతో వ్యాధి విస్తరిస్తోంది. ◆

✻ ఛాయాదేవి

చిన్నప్పుడు 'మానవతి' అనే ఒక రాజకుమార్తె కథ చదివాను. అందులో ఒక రాజకుమారుడు ఒక మానవతి అయిన రాజకుమార్తెని పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. ఆ ప్రయత్నంలో కొంతమంది రాజకుమార్తెలను కలుసుకొని వారికి ఒక ప్రశ్న వేస్తాడు. 'నీ మీద ఎవరైనా అత్యాచారం జరపడానికి ప్రయత్నిస్తే నిన్నెవరు రక్షిస్తారు?' అని దానికి సమాధానంగా - 'నా తండ్రి రక్షిస్తాడ'నీ 'మా సేనాధిపతి రక్షిస్తాడ'నీ, 'నా రక్షక భటులు రక్షిస్తారన'నీ, 'నా చెలికత్తెలు రక్షిస్తార'నీ, 'నా భర్త రక్షిస్తాడ'నీ - ఇలా రకరకాలుగా చెబుతారు రాజకుమార్తెలు. చివరకు ఒక్క రాజకుమార్తె మాత్రం 'నన్ను నేను రక్షించుకుంటాను' అంటుంది. ఆమెనే వివాహం చేసుకుంటాడా రాజకుమారుడు. ఇక్కడ రాజకుమార్తె నిజంగా తన్ను తాను రక్షించుకోగలదా అన్నది కాదు ఆలోచించవలసిన అంశం. ఆమెకున్న ఆత్మ విశ్వాసం అదీ ముఖ్యమైన విషయం.

చేనుమేసే కంచెలుంటే...?

సమాజంలో స్త్రీకి రక్షణలేకపోవడం ఆనాటి నుంచీ వస్తున్నది. తమ్ము తాము రక్షించుకోగలిగిన స్త్రీలకన్నా అత్యాచారాలకు బలైపోయిన వాళ్ళ సంఖ్యే పెరుగుతోంది నానాటికీ. దీనికి కారణం 'కంచే చేనుమేస్తే...' అన్నట్లున్న సామాజిక వ్యవస్థ ఒక వైపు నుంచి స్త్రీ అబల అంటూ సంరక్షణ పేరుతో స్త్రీని నాలుగు గోడల మధ్య బంధించి పురుషుడు అవకాశం దొరికితే చాలు గోడమీది బల్లి పురుగును గటుక్కున మింగినట్లు స్త్రీల బలహీనతపై దెబ్బతీస్తూ, మరో వైపు నుంచి స్త్రీ తన శీలాన్ని కాపాడుకోవడం అత్యావశ్యకమనీ, 'శీలంచెడిన' స్త్రీకి సభ్యసమాజంలో స్థానం లేదనీ శాసించి, స్త్రీకి విముక్తి మార్గం లేకుండా చేశాడు. అంతేగాక, మగవాడు ఏంచేసినా చెల్లుతుందనే 'అనుమతి పత్రాన్ని' తనకు తాను ఇచ్చుకున్నాడు. ఇదీ నేటికీ నడుస్తున్న సామాజిక చరిత్ర.

పూర్వం స్త్రీలు చదువుకోని రోజుల్లో, పూర్వాచారాలు ప్రబలంగా ఉన్న రోజుల్లో అనేక విధాల హింసింపబడ్డారు. ముఖ్యంగా బాల్యవివాహాలు స్త్రీలను నానావిధమైన చిత్రహింసలకూ గురిచేశాయి. రాజారామ్‌మోహన్‌రాయ్, వీరేశలింగంపంతులు, దుర్గాబాయి మొదలైన సంఘ సంస్కర్తల కృషి ఫలితంగా పూర్వపు సాంఘిక దుష్టాచారాలు కొంతవరకు సమసిపోయాయి. కాని నేడు, స్త్రీలకు విద్యాభ్యాసం, ఉద్యోగావకాశాలూ లభించడం పరిపాటి అవుతున్నప్పటికీ, సమాజంలో స్త్రీకి స్థానం మాత్రం పురుషుని స్థాయికి చేరుకోవడం లేదు. ఇప్పటికీ పురుషుని ప్రవర్తనకి ఒక కొలమానం, స్త్రీ ప్రవర్తనకి ఒక కొలమానం వాడుతున్నారు. విద్యాఉద్యోగాల వల్ల స్త్రీకి తాను కోరుకున్న స్వేచ్ఛ లభించకపోగా, గృహ బాధ్యతలతో బాటు ఉద్యోగ నిర్వహణ బాధ్యత కూడా పెరిగి, 'వెనకచూస్తే నుయ్యి, ముందు చూస్తే గొయ్యి' అన్న స్థితిలో ఇరుక్కుపోయింది.

ఆర్థికంగా, సామాజికంగా, చట్టపరంగా తనకు లభించిన హక్కులనూ, అధికారాలను వినియోగించుకోగల స్థితిలో ఉంటుందా స్త్రీ? భర్తపోయిన స్త్రీలు, విడాకులు ఇవ్వవలసివచ్చిన స్త్రీలు తనకు తగిన న్యాయం జరగడం కోసం న్యాయవాదుల దగ్గరకు వెళ్ళి వారి వలలో చిక్కుకుని సంఘం చేత దూషించబడిన వాళ్ళున్నారు. పురుషుల అత్యాచారాలకు గురై రక్షణ కోసం పోలీసుల దగ్గరకు పరుగెత్తి వాళ్ళ విషవలయాల్లో చిక్కుకుపోయిన వాళ్ళెందరో వున్నారు. విద్యాభ్యాసం కోసం వెళ్ళిన ఆడపిల్లలు తోటి విద్యార్థుల ఆకతాయితనానికి, 'గురువుల' అత్యాచారాలకి లోనై, అభాగినులైన వారున్నారు. ఉద్యోగాల కోసం, బదిలీల కోసం అధికారులనూ, రాజకీయ నాయకులనూ ఆశ్రయించి వారి కబంధ హస్తాల్లో చిక్కుకుపోయి, మార్గాంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడిన వాళ్ళూ, లేదా జీవచ్ఛవాల్లా మిగిలిన వాళ్ళూ ఎక్కువవుతున్నారు. ప్రేమించిన వాళ్ళు మోసం చేసినా, తండ్రి పోషించలేని స్థితిలోనూ పెళ్ళి చెయ్యలేని స్థితిలోనూ వున్నా, భర్తపోయి పిల్లల్ని పోషించుకోలేని స్థితిలో వున్నా పడుపు వృత్తి తప్ప గత్యంతరం లేని హీనస్థితికి ఈడుస్తుంది పురుషాధిక్య సమాజం.

ఈ దుస్థితి నుంచి స్త్రీలకు విముక్తి కలిగించడానికి మరో రామమోహన్‌రాయ్, మరో వీరేశలింగం పుట్టాలని ఎదురు చూస్తూ చేతులు ముడుచుక్కూచునే బదులు స్త్రీలు తమంతట తాము ఏం చెయ్యగలమని ఆలోచించుకోవలసిన అగత్యం ఎంతైనా వుంది. ఓటుహక్కు, ఆస్తిహక్కు, న్యాయస్థానాలు, పోలీస్ స్టేషన్లు, వీటివల్ల లభించే రక్షణ, గౌరవం చూస్తూనే వున్నాం. అభివృద్ధి నిరోధక శక్తుల్ని అధిగమించే శక్తి స్త్రీలు ఏ విధంగా పొందాలి, ప్రదర్శించాలి అని ఆలోచించుకోవాలి.

సమాజంలో ఎటువంటి మార్పు తీసుకురావాలన్నా వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ రెండు విధాలా కృషి చేయవలసి ఉంటుంది. మహిళా సంఘాలు, స్త్రీ విముక్తి ఉద్యమాలు ఎంత కృషి చేసినా, వ్యక్తిగతంగా ప్రతి స్త్రీ అభివృద్ధి నిరోధక శక్తుల్ని స్వయంగా ప్రతిఘటించకపోతే ప్రయోజనం ఉండదు. ప్రతిఘటించడమంటే హింసామార్గాన్ని అవలంబించమని కాదు.

పూర్వం రచనల్లోనూ చలన చిత్రాల్లోనూ స్త్రీలు పడే బాధలకు ఆత్మహత్య వంటి ఆత్మ వినాశకరమైన పరిష్కారాలనే చూపేవారు. ఇప్పుడు విప్లవం పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హత్య వంటి హింసాకాండలకు పాల్పడటమే పరిష్కార మార్గంగా చూపిస్తున్నారు. ఇవి రెండూ నిషిద్ధ మార్గాలే. విద్యా సంస్కారాలు చూపవలసినది మధ్యేమార్గం. అది స్త్రీలు తాము చైతన్యవంతులు కావడానికి ప్రయత్నించడమే కాక, పురుషులకు కూడా స్త్రీల సమస్యల పట్ల సదవగాహన కలిగించడమే. ◆

[hidden]ాస్యం



[cut]డ ఒక పొడవాటి [cut]ం వుంది. దానిలో [cut]ఎత్తగలుగుతారా? [cut]ండి. అబ్బే! మీ వల్ల [cut] నేను చూపిస్తా [cut] తాడు. ఎత్తేస్తున్నా... [cut] కుండా ఆశ్చర్యంగా [cut] లేదు. ఆ... ఇప్పుడు [cut]కు ఆ ట్రిక్ ఏంటో [cut]తో మీరు ఎత్తలేని [cut]లా ఎత్తగలిగాను? [cut]షన్. అందుకే అలా [cut]నుకుంటున్నారా? [cut]రు కూడా ఆ [cut]ేపవచ్చు. దీనికి [cut] వస్తువులు కావాలి. కూజా, తాడు, రబ్బరుబంతి. అంతే. [cut]డవుగా వుండాలని ముందుగానే అనుకున్నాంకదా. ఆ [cut]ంతిని వదలండి. తర్వాత తాడు వెయ్యండి. మీరు ప్రదర్శన [cut]డు మాత్రమే కూజాని తలకిందులుగా వంచాలి. తాడును [cut]ట్టుకుంటే అది బంతిని గట్టిగా పట్టుకుంటుంది. అప్పడు [cut]పైకి ఎత్తగలుగుతాం. ఇందులో వున్న ట్రిక్కు ఇదే (రబ్బరు [cut]డు వ్యాసము కలిసి కూజా మూతి వ్యాసము కంటే ఎక్కువ

మేజిక్! మేజిక్!!

కలం స్నేహం

పేరు: టి.కవిత,
వయసు : 15 సం॥
చదువు :10 వతరగతి
హాబీలు :డ్రాయింగ్ వేయడం, పుస్తకాలు చదవడం, పాటలు పాడడం.
పూర్తి చిరునామా : తుపాకుల కవిత, డాటరాఫ్ తుపాకుల దుర్గేశం, 9వ వార్డు, 9-69, నంగునూర్, సిద్ధిపేట, మెదక్.

పేరు:డి.కిరణ్,
వయసు :16 సం॥
చదువు :10 వతరగతి
హాబీలు: క్రికెట్ చూడడం, ఆడడం, టీవీ చూడడం, డ్రాయింగ్ వేయడం, క్యారమ్స్ ఆడడం.
పూర్తి చిరునామా :డి.కిరణ్, పదవ తరగతి, సన్నాఫ్ నాంచారి, మేడిపల్లి, ఘట్‌కేసర్, రంగారెడ్డి.

హాయ్... వేసవి సెలవలు వచ్చేశాయికదా. మీకు 'కలం స్నేహం' చేయాలని వుందా! అయితే ఓ కార్డు తీసుకుని మీ హాబీలు, అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో ఒకటి ఆ కార్డు మీద అంటించి పోస్టు చేయండి.



కోడి-కుంపటి

నా కథ

ఇంద్రపుర గ్రామంలో పార్వతమ్మ అనే అవ్వ నివశిస్తుండేది. ఆమెకు ఒక కోడిపుంజు, కుంపటి వుండేవి. ప్రతిరోజూ వేకువ జామున ఆ కోడి లేచి 'కొక్కొరొకో' అనేది. ఆ కూతకు గ్రామ ప్రజలు మేల్కొనేవారు. అవ్వ దగ్గరున్న కుంపటి నుంచి నిప్పు తీసుకుని తమ ఇళ్లల్లో పొయ్యిలు వెలిగించుకునేవారు. కొంతకాలం గడిచిన తర్వాత అవ్వకి ఆ గ్రామ ప్రజలపై ఈర్ష్య, ద్వేషం ఏర్పడింది. తన కోడి, కుంపటి వల్లనే అక్కడి ప్రజలు జీవించగలుగుతున్నారనుకుంది. అవి లేకపోతే వారి జీవితాలు ఎలా వుంటాయో చూద్దామనుకుంది. ఒక రోజు కోడిని చంకలో పెట్టుకుని, కుంపటి నెత్తిమీద పెట్టుకుని వేరే ఊరు వెళ్లిపోయింది. కొన్ని రోజులు గడిచిన తర్వాత తను లేని గ్రామం ఎలా వుందో చూద్దామనిపించింది. ఓ రోజు సొంత గ్రామానికి బయలుదేరింది. ఆ వూరి పొలిమేర దాటి లోపలికి వెళ్లేసరికి అన్ని ఇళ్లల్లో దీపాలు వెలుగుతున్నాయి. ఇంతలో అక్కడి ప్రజలంతా వచ్చి అవ్వను ఆప్యాయంగా పలకరించారు. అవ్వకు తను చేసిన తప్పు అర్థమైంది. ఏ ఒక్కరిమీదో సమాజం ఆధారపడి లేదని, తను లేకుంటే ఊరే లేదని అనుకోవడం తప్పని తెలుసుకుంది.

జి.వి.ఎస్.ఎన్.రాజు, పెద్దాపురం.

చిన్నారులూ...

ఈ వారం మన నేస్తం రాసిన కథ ఎలా వుంది? మీకు నచ్చిందా! మరి మీరు కూడా సొంతగా కథ రాసి పంపిస్తే 'నా కథ' శీర్షికలో ప్రచురిస్తాం. పది వాక్యాల్లో రాయాలి. పాత కథలను చూసి రాయకండే. మరి మీ కథలకోసం ఎదురుచూస్తూ.....

బాలనేస్తాలు



ఎవరబ్బా!

పదాల పదనిసలు

?	సలి
	రికి
	రిపం
	లికి
	చ్ఛట
	సురు

ఒక్క అక్షరం కలపండి

గతవారం జవాబులు

ఓ	కె	
	డ	
	పి	క
	ట	మి
	టు	

డిస్కో తైతె(తి)క్కలు

* రుక్మిణి

"అవతల కొంపలంటుకుపోతున్నాయి - మీరేమో జనాల్ని జన్మభూములనీ... వెలుగు పథకాలనీ హెలికాప్టరేసుకుని తిరిగి మాయపుచ్చండి." తె.దేశం మంత్రి నెమ్మదిగా తన తోటి మంత్రులతో గొణుగుడు రూపంలో బయటకు కక్కాడు.

"ఎవరి కొంపలంటుకుని కాలిపోకుండా 'జలయజ్ఞం'... నీటి వినియోగదార్ల సంఘాలు... జిల్లాల్లో ముమ్మరంగా ప్రచారాలు చేస్తున్నాం గదా... ఇంకా 'స్వర్ణాంధ్ర'ను సాధించడానికి విజన్ 2020...

"అదికాదు సార్... అవతల జనాలు కరువు దెబ్బకు తిండానికి తిండిలేక ఆకలి చావులు చస్తున్నారు - మన పథకాల వల్ల ఎవడి కడుపూ నిండడం లేదు. జనాలేమో ఆరు కోట్ల టన్నుల బియ్యం ఢిల్లీ గోదాముల్లో ఎలుకలు భోంచేస్తుంటే... జనాలు తిండిలేక చస్తున్నారని అల్లరికి తగులుకుంటున్నారు..

"అక్కడే మీరు పప్పులో కాలేస్తున్నారు - ఆ ఎలుకలకూ మనకూ ఏ సంబంధమూ లేదు. అవి ఎన్డీయే కూటమికి చెందినవి. మనం బయట నుండి మాత్రమే మద్దతిస్తున్నామని తెలియజేసుకుంటున్నాను..

"ఎలుకల సంగతి వదిలేయండి... ఈ గంజికేంద్రాలేంటి? కరువు బిక్షాటనలేంటి? పొరుగు దేశాల్లో మీ కార్పొరేట్ సిఇఓ ప్రతిష్టమాటేంటి? మేం సిగ్గులో కుమిలిపోతున్నాం - అంబలి కేంద్రాలకు జనం విపరీతంగా హాజరై ఆకలి చావుల నుండి తప్పించుకుంటున్నారు. వాళ్ళ సంగతేంటి...?

చంద్రబాబుగారు దీర్ఘ ఆలోచనలో పడిపోయారు. వేల కోట్ల రూపాయలు ప్రపంచబ్యాంకు నుండి అప్పు తేవడం గొప్ప ప్రతిష్టే... కానీ ప్రతిపక్షం భిక్షాటన చేసి గంజి కేంద్రాలు తెరవడం వల్ల... అది అదనంగా పర్యాటక అభివృద్ధికి తోడ్పడుతుందా? పరాయి దేశాల్లో అవమానాలు తెస్తుందా? ఈ సమస్యను తేల్చి చెప్పాల్సింది స్వామి ఆండర్సన్‌గారే - అందుకే బాబుగారు వెంటనే స్వామి ఆండర్సన్ గారిని పిలిపించారు.

మరికొంత సేపటికి స్వామి ఆండర్సన్‌గారు వారి శిష్యులు... అమెరికన్ మొహాలతో... ఆస్ట్రేలియా మందహాసాలతో అరుదెంచిన వారాయెను - బాబుగారు వెంటనే ఈ 'గంజి కేంద్రాల' మతలబునూ.. ప్రజలలో వాటి స్పందననీ... వగైరా విషయాలను వివరించిరి... మంత్రులు మంత్రముగ్ధుల్లా కన్సల్టెంటు గారిని కనురెప్ప వేయకుండా, చెవులు దొప్పల్లా అప్పగించి వారి అమృత వాక్కులను... ఆజ్ఞలను శిరసావహించడానికి బుద్ధిమంతుల్లా సిద్ధపడిపోయారు.

"బాబుగారూ... ఇదేం కఠిన సమస్య కానేకాదు.. సరే.. ఇటు ప్రజలు... ఎవరికీ తిండి దొరకడం లేదు... అటు ఆరుకోట్ల టన్నుల బియ్యం... వాటిని భోం చేస్తున్న కేంద్రంలోని ఎలుకలు..

"ఎట్టెట్టా... మన రాష్ట్రానిక్కూడా 3600 కోట్ల పనికి ఆహార బియ్యం తెచ్చి వాడుకున్నాం గదా... జనం "ఆకలో" అని అరవడం ఏమైనా బాగుందా?" ఓ మంత్రిగారు బహు మూర్ఖంగా తన సందేహాన్ని కక్కాడు.

"ఇక్కడ మాత్రం ఎలుకలు లేవా? అసలు ప్రపంచంలో ఎలుకలు లేని దేశం ఏదైనా ఉందా? వాటికి మాత్రం ఆకలుండదా? అవి దొరికిన దాన్ని దొరికినట్లు బొక్కెయ్యవా?" చంద్రబాబుగారు మండి పడ్డారు. ఆండర్సన్‌గారు మళ్ళా అమెరికా నవ్వు నవ్వారు.

"సర్సరె... మనిషికి ఆకలి ఎన్ని రకాలు..." ఈ సూటి ప్రశ్నకు అక్కడి మంత్రులందరూ బిత్తరపోయి తెల్లబోయారు. బాబుగారు మాత్రం మటమటలాడుతూ మిన్నకుండిపోయారు.

"కడుపు ఖాళీ అయి తింటానికేం లేకపోతే అయ్యేదే ఆకలి! మండిపోయేది కడుపే... దాన్నే కరువు అని కూడా అంటారు గదా!" నీళ్ళు నవులుతూ ఓ మంత్రిగారు తన వ్యాఖ్యానాన్ని విన్నవించుకున్నారు.

"చాలా పొరపాటు... ఆకలి బహు రకాలు... ఆకలి ఒక బలమైన కోరిక...దాన్ని వివరించాలంటే... పదవుల ఆకలి... పైరవీల ఆకలి... డబ్బు సంపాదనపై ఆకలి... ఇతరుల భార్యల మీద ఆకలి... అబ్బో... ఆకలి అంటే కోరిక... కోరిక చాలా బలమైంది. మా అమెరికా ఇంత సుసంపన్నంగా వున్నా మా 'ఆకలి' తీరుతుందా? తీరలేదు గదా! ఇరాక్ వంటి ఆయిల్ తదితర సంపన్న దేశాలను మింగకుండా మా ఆకలి తీరుతుందా... తీరదు గదా? మీ తె.దేశం నాయకులు మొన్నటికి మొన్న మీ సంస్థాగత ఎన్నికలలో చిన్నచిన్న 'పదవుల ఆకలి' చల్లార్చుకోడం కోసం వీరంగాలు చేశారు. కుర్చీలు విసురుకున్నారు. ముష్టి యుద్ధాలకు దిగిపోయారు. చొక్కాలు చించుకున్నారు."

"మంత్రులందరికీ 'గంజికేంద్రాల దెబ్బ' తట్టుకునే కిటుకు చెప్పరా మగడా అంటే తమ తన్నులాటల జాబితాలు చెబుతున్నాడు. బాబుగారికి మాత్రం వారు అట్లా చెప్పి చీవాట్లు పెట్టడం కుసింత ఆనందాన్ని కలిగించింది. అంతే కావాలి...

"కాబట్టి ఆకలి చల్లార్చుకోడానికి మార్గాలు వెదకాలి... కాలే కడుపుకు ఇంత గంజిపోస్తున్నారంటే జనం క్యూలు కట్టడం సహజం. గంజి అయిపోగానే ఎవడి ఆరాటంలో వాడు పడిపోతాడని గమనింపవలెను."

"అయితే మరి దీనికి ప్రత్యామ్నాయం సూచించరా!"

"ఉంది. మనిషికి తృప్తి కావాలి... కడుపు నిండంగానే సరిపోదు.. ఆశనూ... కోరికలనూ చల్లార్చుకోడానికి తృప్తి కావాలి... ఎట్లాగూ ఎండిన డొక్కలతో వాళ్ళు యోగాసనాలు వేయలేరు కాబట్టి వారికి మానసిక ఆనందం... తృప్తి కలిగించాలి."

"ఎట్లా"? బాబుగారు చాలా ఆత్రంగా అడిగారు.

'మనిషికి సౌందర్యోపాసనలో హెచ్చు తగ్గులు లేవు. సృష్టిలో రసాస్వాదన చాలా గొప్పది. అందుకే గ్రామ గ్రామాన 'డిస్కోతెక్'లు తెరవండి. అర్ధనగ్న... నగ్నంగా మహిళలచే ప్రోగ్రాములు ఏర్పాటు చేయండి... జనం ఆకలి మరిచిపోయి ఎగబడిపోతారు!"

ఓ యువక మంత్రి నోరు బార్లా తెరిచి దబ్బున వెనక్కు విరుచుకుపడి పోయాడు.

"దీనివల్ల మహిళలకు ఉపాధి కల్పన... మహిళా సాధికారికతను సాధించిన ఘనత మీకు - వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడతారు. అవయవాలను ప్రదర్శించి ఆర్జించడంలో అసలు దోషం లేనేలేదు. అది మన టూరిజానికి కూడా మంచివూపు ఇచ్చి విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చి పెడుతుంది. సగటు మానవుడు లొట్టలేసుకుంటూ అన్నీ మరిచిపోయి ఆనందంలో తేలిపోతాడు. మన ఖజానా కూడా నిండిపోతుంది - ఉపాధి అవకాశాలు విపరీతంగా పెరిగిపోతాయి!"

మంత్రులందరూ మనసులో లబోదిబో మనుకుంటున్నా చంద్రబాబుగారి మొహం మాత్రం ప్రకాశవంతంగా వెలిగిపోతోంది!

అర్ధాంగి అనగా ?



* లక్ష్మి

ప్రపంచం రూపాయి చుట్టూతా తిరుగుతుందని చెబ్తారు. డబ్బుకు లోకం దాసోహమని కూడా అంటారు. రూపాయికి యావత్తు ప్రపంచమే సెల్యూట్ చేస్తున్నప్పుడు ఆఫ్టరాల్ నేనెంత ? అటూఇటుగా తమరెంత ? అంచేత మనమంతా రూపాయికి జై కొట్టాల్సిందే! మనిషి బతుక్కి రూపాయి ఆక్సిజన్‌లాగా పని చేస్తోంది. అయితే ఇక్కడో చిన్న తిరకాసుంది. కష్టపడి సంపాయించుకున్న రూపాయితో కొండంత తృప్తి కొనుక్కోవచ్చు. జేబులు కొట్టీ, నోళ్ళు కొట్టీ, దోపిడి చేసి సంపాయించిన లక్షల్లో సుఖం బొత్తిగా లేకపోగా అశాంతి ఎక్కువవుతుందని ధర్మశాస్త్రం చెబుతోంది! బతకడానికి డబ్బవసరమేగాని - కేవలం డబ్బు కోసమే బతకాలనుకోడం ఫూలిష్ థాట్ అంటున్నారు దైవజ్ఞులు. వదిలేయండి!

అబ్బాయి చదువుకున్న వాడు. అమ్మాయి కూడా అంతే చదువు చదివింది. ఇద్దరూ సమ ఉజ్జీలుగా వున్నప్పుడు - వాళ్ళిద్దరికీ పెళ్ళయితే - ఎవరు ఎవరికి తలొంచాలి? ఇక్కడొస్తుంది పేచీ. అనాదిగా ఆడవాళ్ళు మగాళ్ళకు తలొంచి బతికేస్తున్నారు. ఏ శుభ మహూర్తాన పెళ్ళి పీటల మీద తలొంచి అతడి చేత మంగళసూత్రం కట్టించుకుందో - ఆ క్షణం లగాయితు ఆమె అతని శాసనాలను తలొంచి ఆచరించాలే తప్ప- అదేమిటి దేమిటని ప్రశ్నించడానిక్కి వీల్లేదు. ఇది ఇప్పటి తంతుకాదు. ఆదికాలంలో సైతం ఇట్లాగే జరిగింది!

తన ప్రమేయం లేకుండా - తన భర్త తనని పేకాటలో పందెం కాసి ఓడిపోయిన పాపానికి ద్రౌపదీ దేవి నిండు సభలో అవమానింపబడింది. అడవుల పాలైంది. దాసి బతుకు బతికింది. ఇంతహీన స్థితికి పడిపోయి ఓర్పుగా బతికిందే గాని - నన్ను పందెం కాయడానికి మీకేం హక్కుందని రూలడగలేదు. కట్టుకున్న భార్యని నడిబజార్లో నిలబెట్టి వేలం వేసి అమ్మేస్తున్నప్పుడు - తగునా ఇది నాథా అని చంద్రమతి పద్యాలు పాడలేదు. హరిశ్చంద్రుడి కిరాతకాన్ని ప్రశ్నించలేదు. ఎవడో ఏదో కూసేడన్న నెపంతో తనని అడవుల పాలు చేసిన రాముడ్ని సీతమ్మతల్లి పల్లెత్తుమాటనలేదు. ఆ తల్లుల్ని ఆదర్శంగా పెట్టుకుని మహిళాలోకం బతుకుతోంది. నీతినియమాలు కేవలం ఆడవారికి మాత్రమే వుంటాయని చెప్పి - వాళ్ళని అణగదొక్కే మగమారాజులకు ఆ రోజుల్లోనే కాదు - ఈ మోడరన్ డేస్‌లో కూడా చుక్కెదురు లేకుండా పోతోంది !

మరో పక్క - సదరు భర్త క్షేమం కోసం శ్రావణ శుక్రవారాలు, మంగళవారాలు, కార్తీక సోమవారాలు ఎంతో నిష్టగా చేసుకుంటో బతికేస్తున్నారు అతివలు! మగవాళ్ళేమో బరితెగించి తిరిగేస్తున్నారు! కట్నం రూపంలో వేలూ లక్షలు పోసి కొనుక్కుని కూడా - అతడికి బానిసగా బతికే బతుక్కి అలవాటు పడిపోతున్నారు. మగమారాజు మాత్రం తన భార్య తెచ్చిన కట్నం డబ్బుతో కులాసా జీవితానికి అలవాటు పడుతున్నాడు. ఎంతకీ అప్పనంగా వచ్చే డబ్బు కోసం వెర్రిచూపులు చూడటం తప్పించి - ఇల్లాల్ని ఆదరంగా, ఒక మంచిస్నేహితురాలిగా చేసుకోలేకపోతున్నాడు. పెళ్ళయితే కట్నమొస్తుందనే నీచమైన ఆశ తప్ప - అర్ధాంగి పేరిట ఒక స్త్రీ తన జీవితంలోకి ఆత్మీయంగా అడుగు పెడుతోందని అర్థం చేసుకోలేకపోతున్నాడు! అతనిక్కావల్సిందల్లా కేవలం మూడు దినుసులు. ఒకటి డబ్బు. రెండు డబ్బు. మూడు డబ్బు!

ఇల్లాంటి ఆశపోతుని దున్నపోతు అని పిలిచినా అతను సిగ్గుపడడు. తనక్కావల్సింది దొరికిం తర్వాత ఎవరేమి అనుకుంటే తనకేమని ధీమాగా తిరుగుతున్నాడు. పెళ్ళి ద్వారా తనకి దగ్గిరయ్యేది అర్ధాంగి కానేకాదు. అంతోఇంతో అర్థం! ఆ అర్థమే లేకపోతే అర్ధాంగితో అవసరమే లేదు! అసలు అర్ధాంగి అక్కర్లేదంటాడు. తాను పెళ్ళి చేసుకునేది డబ్బునే తప్ప అమ్మాయిని కాదంటాడు. ఈ స్టేట్‌మెంటు ఇచ్చేందుకు అతను సిగ్గుపడడు. బాధపడడు. జేబులు కొట్టడం, నోళ్ళు కొట్టడం, దోపిడీలు చేయడం లాంటి దుర్మార్గాలకు సదురు కట్న వాంఛ ఏ మాత్రం తక్కువకాదు!

ఆ కట్నంతో న్కూటరు కొనుక్కుంటాడు. సరదాగా తిరుగుతాడు. సుఖపడుతున్నానని అనుకుంటాడే గాని - దోపిడీకి గురైన హృదయాలు ఎంత ఏడుస్తున్నాయో గమనించలేడు. గమనించినా పట్టించుకోడు. అనుకున్న కట్నం అనుకున్న వేళకి రాకపోతే - కిరసనాయిలుందని కట్టుకున్న ఇల్లాల్ని భయపెడతాడు. ఆమె తల్లిదండ్రులను అదరగొడతాడు. పిల్లనిచ్చిన పాపానికి ఇల్లమ్ముకుని వీధుల పాలవ్వమని అత్తమామలకు ఉత్తరాలు రాస్తాడు. లేకపోతే కిరసనాయిలుందని గుర్తు చేస్తాడు. కిరసనాయిల్ని ఎవరు ఎందుకు కనిపెట్టేరోగాని - ముందు ఆ యొక్క పదార్థాన్ని ఆటంబాంబుగా పరిగణించి నిషేధిస్తే బెటరని - మొన్న కట్నం చావు వార్త చదివింతర్వాత అనిపించింది! అదే మీకు మనవి చేసుకుంటున్నాను. నా పిచ్చిగానీ - కిరసనాయిల్ని నిషేధించినంత మాత్రాన కట్నం చావులు ఆగిపోతాయా? వచ్చుటి ఇల్లాల్ని మాడ్చి పెట్టడానికి ఎన్ని మార్గాలులేవూ ? ◆



వెయ్యేళ్ళ చరిత్ర గల వేయి స్తంభాల గుడి

* సిహెచ్ సోమనర్సయ్య

కళాతృష్టకు పరాకాష్టగా, కాకతీయుల శిల్ప కళకు మచ్చుతునకగా వెలుగొందుతోంది హన్మకొండలోని వేయిస్తంభాల గుడి. కేవలం కళానైపుణ్యమే కాకుండా వాస్తు నిర్మాణ శైలికి, కాకతీయుల నాటి సంస్కృతీ సంప్రదాయాలకు దర్పణం పట్టే విధంగా ఉన్న వేయి స్తంభాల రుద్రేశ్వరాలయం ప్రస్తుతం పురావస్తు శాఖ రక్షణలో ఉంది. క్రీ.శ.1158 నుంచి 1195 సంవత్సరం వరకు కాకతీయ రాజ్యాన్ని పరిపాలించిన రుద్ర దేవుడు త్రికూటాలయమైన వేయిస్తంభాల గుడిని నిర్మించినట్లు చరిత్ర వివరిస్తుంది. ఎందరో కళాప్రియుల్ని, దేశ, విదేశీ పర్యాటకుల్ని ఆకర్షిస్తూ వారి మనస్సులను రంజింపజేస్తోంది. కేవలం భక్తికోసమే కాకుండా పూర్తి నిర్మాణాన్ని శిల్పాల సముదాయం, నక్షత్రాకృతి గల ఆలయ ప్రదక్షిణ పదంపై మూడు దేవాలయాలతో తమ కళాప్రతిభను పూర్తిగా రంగరించి శిలలను సైతం జీవం ఉట్టిపడేలా మలచి చూపరులకు కనువిందు కల్గించేలా రూపొందించారు.

వాస్తవానికి దక్షిణాభిముఖంగా నిర్మించిన దేవాలయం, ప్రహరీగోడ నుంచి ప్రధాన ద్వారం వరకు మాత్రం ప్రస్తుతం ఉత్తరాభిముఖంగా వుంది. రుద్రేశ్వరుని పేరుతో ఏడడుగుల ఎత్తైన పానపట్టుల గల శివుని విగ్రహం, తొమ్మిది అడుగుల ఎత్తుతో ఆలయం, దానికి ఎదురుగా అదే ఎత్తు సూర్యాలయం, దక్షిణాభిముఖంగా వాసుదేవాలయం ఉన్నందునే దీనిని త్రికూటాలయంగా పేర్కొన్నారు. అయితే మహ్మదీయుల దండయాత్రలో సూర్య, వాసుదేవ విగ్రహాలు అపహరించారు. రుద్రేశ్వరాలయ ముఖ ద్వారం మీద మనోహరమైన గణపతి విగ్రహం, రెండు పక్కలా శివగణాలు, చమర దారిణులైన గంధర్వులు, వివిధ భంగిమల్లో నృత్యం చేస్తున్న నర్తకుల శిల్పాలు చెక్కి ఉన్నాయి. శిల్పకారుని నైపుణ్యానికి నిదర్శనంగా ముక్కుపుడకలు పట్టేంతటి సన్నని రంధ్రాలు చెక్కబడి ఉన్నాయి. రుద్రేశ్వరాలయం ముందు రెండవ ద్వారం పైన నటరాజుతో కూడిన బ్రహ్మ, విష్ణువులు, రెండువైపులా ద్వార పాలకుల ప్రతిమలు చెక్కారు. మూడు దేవాలయాలకు మధ్య రంప మండపం ఉంది. నాలుగు స్థంభాలపై సుందర నగిషీ చిత్రాలు అలనాటి రాణులు, మహిళలు ధరించిన ఆభరణాల ఆకృతులతో చెక్కి ఉన్నాయి. పైన వలయంలో గాయత్రీదేవి విగ్రహం, గజములు, అశ్వం, ఒంటెలు చెక్కి ఉన్నాయి. దాని మధ్య షట్కోణాకృతిలో ఒక పద్మాన్ని అత్యంత సుందరంగా మలిచారు. తామరపువ్వు మీద నృత్యం చేస్తున్న నర్సింహస్వామి, వాసుదేవాలయం ముందు దీని చుట్టూ దశావతారాలు, సూర్యదేవాలయంలో ముందు ఐరావతం గల ఇంద్రుడు, ఇరుపక్కలా దేవనర్తకుల శిల్పాలను రమణీయంగా తీర్చిదిద్దారు. కాకతీయుల కళావిపాసకు మచ్చుతునకగా వెలుగొందుతున్న వేయి స్తంభాల దేవాలయాన్ని పర్యాటక శాఖ మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.

చారిత్రాత్మక ప్రాధాన్యమే కాకుండా అహ్లాదకరమైన వాతావరణం, అందాలొలికే తటాకాలు, శిల్పకళాఖండాల మధ్య హనుమకొండ అలరారుతోంది. పెద్ద గుట్టలను ఆనుకొని ఉన్న 'హనుమకొండ' పట్టణం పేరుకు, కొండలకు మధ్య విడదీయని బంధమున్నది. పద్మాక్షిదేవాలయం వెలసిన పర్వతం, జైనమత విగ్రహాలతో కూడిన హనుమద్గిరికి నామౌచిత్యాన్ని ధృవీకరిస్తూ అష్ట దిక్కులందూ హనుమంతుని దేవాలయాలున్నాయి. ఆగ్నేయ దిశవైపు భద్రకాళి తటాకంలో గల హనుమంతుని దేవాలయం మినహా మిగిలిన అన్ని దేవాలయాలు నేడు సైతం పూజలందుకుంటున్నాయి. చారిత్రాత్మక ఆధారాలను అనుసరించి 'ఎరుకుదేవర' అనే శ్రీశైల ప్రాంతపు రాజు హనుమకొండ అధిపతిని జయించి రాజ్యాన్ని స్థాపించినట్లు తెలుస్తోంది. అతని పుత్రులైన అనుమడు, కొండడు పేర్ల మీదుగా హనుమద్గిరి పక్కనే అనుమకొండ పట్టణాన్ని నిర్మించి పాలన సాగించాడు. వాస్తు ప్రాధాన్యంతో నిర్మించిన అనుమకొండను నాగడు, గార్గేయుడు అనువారలు 150 సంవత్సరాలు పరిపాలించినట్లు తెలుస్తోంది. చంద్రవంశస్తుడైన మాధవవర్మ కూడా వంద సంవత్సరాలు పాలించినట్లు తెలుస్తోంది. హనుమద్గిరి పేరిట పాలించిన ఈ నగరాన్ని కాకతీయుల ప్రథముడైన బేతరాజు దండెత్తి అనుమడు, కొండడులను చంపి రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నట్లు చరిత్రకారులు చెబుతారు. మూడు వైపులా గుట్టలు ఒక పక్క భద్రకాళి చెరువుతో శత్రుదుర్భేద్యమైన దుర్గాన్ని మట్టికోటను నిర్మించినట్లు తెలుస్తోంది. 'హనుమకొండ'కు మరో వైపు సిద్దేశ్వరాలయం చరిత్ర ఉంది. కొండపై(గగ్గిలయ్య గుట్ట) పెద్ద జూన విగ్రహం దర్శనమిస్తుంది. సిద్దేశ్వరాలయం సమీపంలోని పెద్ద వృక్షం వద్ద కాకతీయులు కొలిచిన ఛాముండేశ్వరి పెద్ద బాహువులతో ఉండేదని అంటారు.

12వ శతాబ్దంలో గణపతి దేవరాజు వరకు హనుమకొండ రాజధానిగా రాజ్యమేలారు. కాకతి బేతరాజు, ప్రోలరాజును చంపి రుద్రదేవుడు హనుమకొండను పాలించారు. కాలక్రమంలో అనుమకొండ హనుమకొండగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం హనుమద్గిరి చుట్టూ బాలాంజనేయ, ప్రసన్నాంజనేయ, వీరాంజనేయ, రభయాంజనేయ దేవాలయాలు పురవాసుల నుంచి విశేష ఆదరణ పొందుతుండగా గుట్టపై ఉన్న దేవళాన్ని సైతం ఏడాదికోమారు ప్రజలు దర్శిస్తున్నారు. గుట్టకు సంబంధించిన స్థలం పలు అధికార, అనధికార ఆక్రమణలకు గురవుతుండగా వెయ్యేళ్ళ చరిత్ర గల హనుమద్గిరి పేరును 'నీలాద్రి' గిరిగా మార్చాలని కొన్ని సంస్థలు ప్రయత్నించటం పట్ల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ◆

తీరుమారని దేశవాళీ క్రికెట్


రంజీట్రోఫీతో ముంబయి క్రికెట్ జట్టు

✻ హసన్ షరీఫ్

దేశవాళీ క్రికెట్‌లో సాధారణంగా రంజీమ్యాచ్‌ల పట్ల క్రీడాభిమానులు అంతగా ఆసక్తి కనబర్చరు. ఎవరు గెలిచినా పోయేదేమిటి? అనే రీతిలో అభిమానుల ఆలోచన ఉంటుంది. అయితే ఈసారి జరిగిన రంజీమ్యాచ్‌ల తీరు ఇందుకు భిన్నంగా ఉంది. ప్రపంచకప్, తర్వాత ఢాకాలో జరిగిన టివిఎస్ కప్ టోర్నమెంట్ల అనంతరం భారత జట్టుకు ఐదు మాసాల పాటు విశ్రాంతి లభించింది. జాతీయ జట్టులోని అగ్రశ్రేణి క్రీడాకారులు రంజీట్రోఫీ సెమీస్, ఫైనల్లో పాల్గొనడంతో ఈ మ్యాచ్‌లపై సహజంగానే ప్రేక్షకులకు ఆసక్తి పెరిగింది. రంజీమ్యాచ్‌లు కొంతమేరకు ప్రేక్షకుల ఆకాంక్షలకు అనుగుణంగానే జరిగింది.

ముంబయి-తమిళనాడు జట్ల మధ్య ముంబయిలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీ పోరాటం జరిగాయి. ఐదు రోజుల ఈ మ్యాచ్‌లో ఆధిక్యం కూడా రోజుకో జట్టు వైపుకు మొగ్గింది. అయినా దేశవాళీ పోటీల్లో అత్యంత ప్రధాన టోర్నమెంట్ అయిన రంజీట్రోఫీ ఛాంపియన్‌షిప్ అంచనాలకు తగ్గట్టుగా జరగలేదని క్రికెట్ పండితులు వాదిస్తున్నారు. కొంతమంది బ్యాట్స్‌మెన్ మాత్రమే తమ బ్యాటింగ్‌తో అబ్బురపర్చారు. బౌలింగ్‌లో అజిత్ అగార్కర్ మాత్రమే బ్యాట్స్‌మెన్‌ను ముప్పు తిప్పలు పెట్టగలిగాడు. దేశవాళీ పోటీల్లో అత్యున్నత టోర్నీలో బౌలింగ్ ఏ స్థాయిలో ఉండాలో ఊహించగలిగారా? ఆ స్థాయిని బౌలర్లు ప్రదర్శించలేదనే తెలుస్తోంది. ఈ మ్యాచ్‌లో కనబర్చే ప్రతిభ ఆధారంగానే అంతర్జాతీయ మ్యాచ్‌లకు బౌలర్లను ఎంపికచేస్తారనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ స్థాయిలో ఆస్ట్రేలియా కనబరుస్తున్న ప్రతిభ, వారి ఆటతీరును గురించే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ప్రస్తావిస్తున్నారు. ఆసీస్ ఈ స్థాయికి చేరుకోవడానికి ఆ దేశం దేశవాళీ పోటీల్లో అనుసరిస్తున్న పద్ధతే ప్రధాన కారణం. అంతర్జాతీయ పోటీల్లో రాణించడానికి దేశవాళీ పోటీల్లో ఉన్నత ప్రమాణాలు పాటించాలనే విషయాన్ని ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (ఎసిబి) ఎప్పుడో గుర్తించింది. దేశవాళీ పోటీల్లో తమ ప్రధాన ఆటగాళ్లంతా పాల్గొనేటట్లు ఎసిబి ప్రణాళిక సిద్ధం చేసింది. అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను కూడా ఎసిబి దీనికి అనుగుణంగానే సిద్ధం చేసింది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు దీనికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఒక సిరీస్‌కు, మరో సిరీస్‌కు మధ్య కొన్ని రోజులు సమయం చిక్కినా క్రికెట్ అధికారులు భారత జట్టు సభ్యులను ఏదో ఒక వన్డే టోర్నమెంట్‌లో ఆడిస్తూ ఆటగాళ్లకు విశ్రాంతి లేకుండా చేస్తున్నారు. దీంతో ప్రధాన ఆటగాళ్లు దేశవాళీ పోటీలకు గైర్హాజరు అవుతున్నారు. దీంతో దేశవాళీ పోటీల్లో ఆటగాళ్ల నిజమైన ప్రతిభను గుర్తించడంలో విఫలమవుతున్న అధికారులు అత్యున్నత ప్రమాణాలతో కూడిన జాతీయ జట్టును రూపొందించలేకపోతున్నారు. భారత్-ఎ జట్టు వెస్టిండీస్‌లో పర్యటించడం వల్ల గత సీజన్‌లో రంజీట్రోఫీ టోర్నీకి కనీసం 45 రోజులపాటు అంతరాయం కలిగింది. భారత రెండోస్థాయి జట్టుకు కరేబియన్ పిచ్‌లపై ప్రాక్టీసు లభించడం మంచి విషయమే. అయితే దీని వల్ల దేశవాళీ పోటీలకు తగులుతున్న దెబ్బను అధికారులు గుర్తించడం లేదు. దేశవాళీ పోటీలు ప్రారంభమైన తర్వాత మధ్యలో అంతరాయం కలిగే సాంప్రదాయం భారత్ మినహా మరే దేశంలోనూ లేదు. బిసిసిఐ ఆలోచనా రహిత నిర్ణయాల కారణంగా రంజీట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను మే నెలలో నిర్వహించాల్సి వచ్చింది. వెస్టిండీస్ క్రికెట్ బోర్డుతో ముందే కుదుర్చుకున్న ఒప్పందాలను గౌరవించాలనే నెపంతో ఎండలు ఎక్కువగా ఉండే మే నెలలో సైతం క్రికెటర్లను ఇబ్బంది పెట్టేందుకు బిసిసిఐ వెనకాడలేదు. ఏప్రిల్, మే నెలల్లో వాతావరణం చాలా వేడిగా ఉండడం వల్ల క్రికెటర్లకు విశ్రాంతి ఇవ్వాలనేది క్రికెట్ నిపుణుల అభిప్రాయం. బిసిసిఐ ఎన్నో సంవత్సరాల నుండి ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లకు ఇబ్బంది పెట్టడమే కర్తవ్యంగా వ్యవహరిస్తోంది. జాతీయ జట్టులో స్థానం కోసం జీవితాన్ని ధారపోస్తున్న ఈ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లు బోర్డుతో ఘర్షణ పడితే తమ భవిష్యత్తు అంధకారమయం అవుతుందనే భయంతో మౌనం వహిస్తున్నారు. అందులో కొంతమంది భారత క్రికెట్ ఆటగాళ్ల అసోసియేషన్‌లో సభ్యత్వం పొందినందున వారు తమ హక్కుల కోసం పోరాడే అవకాశం ఉంది. ఇప్పుడైనా బోర్డు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిద్దాం.

ఫాస్ట్ పిచ్‌లపై ఇప్పటికీ అనాసక్తే !

మరోవైపు ఫాస్ట్ పిచ్‌లను తయారు చేయడం దిశగా బిసిసిఐ ఇప్పటివరకూ ఎటువంటి అడుగులు వేయలేదు. తర్వాత ప్రపంచకప్ (2007లో) వెస్టిండీస్‌లో ఉండడం వల్ల, విదేశీ పిచ్‌లు ఎక్కువగా ఫాస్ట్ పిచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల భారత్ కూడా అటువంటి పిచ్‌లపై ప్రాక్టీసును ఇప్పటినుండే ప్రారంభించడం అత్యంత అవసరం. భారత జట్టులోని యువ ఆటగాళ్లకు ఫాస్ట్ పిచ్‌లపై ఆడే అలవాటును ఇప్పటినుండే ప్రారంభించకుంటే వారుకూడా స్వదేశంలో పులులు, విదేశాల్లో పిల్లులుగా మారే ప్రమాదం ఉంది. డబ్బులకు కొదవలేని బిసిసిఐ అవసరమైతే విదేశీ సాంకేతిక సహాయం తీసుకొని ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌లలో ఉన్నటువంటి పిచ్‌లను తయారు చేసే దిశగా అడుగులు వేయాలి. దక్షిణాఫ్రికా ప్రపంచకప్‌కు చాలా కాలం ముందు నుండే క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ ఫాస్ట్ పిచ్‌ల ప్రాధాన్యతను గురించి ఎన్నోసార్లు నొక్కిచెప్పాడు. కానీ బిసిసిఐ ఆ మాటలను పట్టించుకోలేదు. భారత్ దక్షిణాఫ్రికాలో ఫైనల్ వరకూ చేరుకోగలిగినప్పటికీ ఫాస్ట్ పిచ్‌లపై ఆడడంలో తప్పటడుగులు వేసి కప్‌ను కోల్పోయింది. ఫైనల్ వరకూ కష్టపడి వెళ్లిన భారత్ కప్ సాధించలేక పోవడానికి ఒక కారణం బిసిసిఐ ఫాస్ట్ పిచ్‌లను తయారు చేయలేకపోవడమే. బిసిసిఐ ఇప్పటి నుండైనా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తే వెస్టిండీస్‌లో జరిగే తొమ్మిదో ప్రపంచకప్‌పై భారత్ ఆశలు పెట్టుకోగలుగుతుంది. ◆

✻ పి.వి.బి. శ్రీరామమూర్తి

నిన్న మధ్యాహ్నం అనగా కన్ను మూసాడు నారాయణరావు.

తెల్లారి పది గంటల వుతోంది. బాగా డబ్బులున్నప్పుడు చుట్టూ చేరిన బంధువుల్లా అతని చుట్టూ చీమలు. మనిషి చనిపోయినట్లు కనిపించటంలేదు. కానీ - నిన్నటికీ ఇవాల్టికీ మార్పే మిటంటే శవం కొంచెం కంపు కొడుతోంది. చుట్టూ అగరొత్తులు వెలిగించారు. శవం మీద సెంటు చల్లారు. అయినా ఆ వాసనలను అధిగమించి కంపు వస్తోంది. శవాన్ని మోసే మనుషులు కనిపించటంలేదు.

రావలసిన బంధువు లెవరూ లేరు

అనివార్యం

భార్య - నారాయణరావుకి నాలుగు పదులు నిండకుండానే మూడు పంటలు పండేసి తనువు చాలించింది. భార్యమరణం నారాయణ రావును బాగా కృంగదీసింది.

చుట్టాలు, స్నేహితులూ నారాయణరావుని మళ్ళీ పెళ్ళి చేసుకోమని బలవంతం చేశారు. నారాయణరావు వినలేదు. మగాడుపోతే ఆడది జీవితాంతం వైధవ్య దుఃఖంతో కుమిలిపోతుంది. మరి భార్యపోయిన వెంటనే మగాణ్ణి పెళ్ళి చేసుకోమని ప్రోత్సహించటం ఏ సత్సంప్రదాయానికి ప్రతీక? న్యాయం అందరికీ ఒకేలా ఉండాలి!' అని వాదించేవాడు.

"ఆడదానికి రెండో పెళ్ళి మన సంస్కృతిలో లేదు." బంధువుల్లో ఒకాయన అన్నాడు. నారాయణరావు త్రాచుపాములా లేచాడతనిమీద. "ఎప్పుడో అర్థంలేని ఆచారాలు మన నెత్తిన రుద్దితే వాటిని అదే రీతిలో ఆచరించుకోవటంలో అర్థంలేదు. ఎన్ని సంస్కరణలు వచ్చినా - వ్యక్తుల్లో మార్పు రానంతకాలం సంస్కర్తలు ఎంత శ్రమించినా ఫలితం ఉండదు" అన్నాడు.

చెప్పి, చెప్పి విసుగెత్తి పోయారు.

'నలభయ్యోపడిలో ఉన్నవాడికి ఆడదానితో అవసరం లేకుండా ఎన్నాళ్ళుంటాడు? అప్పుడు తనే ఎవరో అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోక మానడు' అనుకున్నారంతా.

కానీ వాళ్ళనుకున్నట్లు జరగలేదు. నారాయణరావుకు తొలి సంతానం కొడుకు. తరువాత ఇద్దరూ ఆడపిల్లలే. తాతల నుండి వస్తోన్న ఆయుర్వేదాన్ని నమ్ముకుని, ఆ రోజుల్లో వచ్చిన ఉద్యోగాన్ని వదులుకున్నాడు.

నారాయణరావు హస్తవాసి మంచి దంటారందరూ.

చుట్టు పక్కల జనం కాక -

ఎక్కడెక్కణ్ణుంచో వస్తుంటారు వైద్యం కోసం. పెద్దపెద్ద డాక్టర్లు నయం చేయలేని జబ్బులను నారాయణరావు నయం చేసేవాడు. ఎంతిస్తే అంతే పుచ్చుకునేవాడు. ఇవ్వలేని వాళ్ళు లేదని చెప్పటానికి సంశయిస్తే – "వెళ్ళండ్రా! డబ్బుదేముంది? ఇవాళుంటుంది. రేపు పోతుంది. మంచే కలకాలం నిలుస్తుంది" అనేవాడు.

అలాగా అతను సంపాదించే మంచితనమే అతని ఆస్తికంటే ఎక్కువ. పెద్దాణ్ణి డిగ్రీ చదివించాడు. స్టేట్ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగానికెళ్తూ కొడుకు తనతో తండ్రిని రమ్మంటే నారాయణరావు వినలేదు. 'నా శక్తి మీద నమ్మకం నన్నగిల్లిన రోజు నేనే వచ్చేస్తా'నన్నాడు.

కొడుకు కామేశ్వరరావు ఉద్యోగానికే వెళ్ళనన్నాడు.

నారాయణరావు కొడుక్కి నచ్చ చెప్పాడు. పెద్దలందరూ కామేశ్వరరావుని ఉద్యోగంలో చేరేటట్లు చేశారు. మొదటి నెల జీతం అందగానే కొడుకు ఖర్చులకు పోగా – మిగిలిన డబ్బులు తండ్రికి పంపాడు. తిరస్కరిస్తే కొడుకు మనసు గాయపడుతుందని ఆ డబ్బుతో కూతుళ్ళకీ తనకీ బట్టలు తీసుకున్నాడు. "ఇక పై నాకు డబ్బులు పంపొద్దు. అక్కడే బ్యాంకులో వేసుకో. చెల్లెళ్ళ పెళ్ళికి అవసరమైతే అడుగుతాను" అని రాశాడు.

తరువాత ఓ మంచి పిల్లను చూసి కొడుక్కి పెళ్ళి చేశాడు. మరి కొద్ది సంవత్సరాలలోనే కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు.

కామేశ్వరరావు తండ్రిని ఒంటరిగా వదలటం ఇష్టం లేక తనతో రమ్మన్నాడు. నారాయణరావు కొన్నాళ్ళుపోతే వస్తానన్నాడు. చుట్టువక్కల జనం 'బాబు లేకపోతే మేమేమయిపోవాలి?' అన్నారు.

కూతుళ్ళూ తండ్రిని వచ్చీమన్నారు తమతో, నారాయణరావు వినలేదు. అతనింటి నిండా ఎప్పుడూ జనమే. రెగ్యులర్‌గా పోలయ్య, అతని భార్య ఎర్రమ్మ ఉండేవారు. ఎర్రమ్మ వంట చేసేది. ఎర్రమ్మ వంట చేసి పెట్టడం టికులస్తులు నిరసించారు. 'ఆ అప్రాచ్యపు ండ చేతివంట తినకపోతే – హాయిగా కు దగ్గరకు పోరాదూ? పాపం! ఆ పిచ్చి కన్న నెత్తీనోరూ కొట్టుకుని ఏడుస్తాడు వచ్చినపుడల్లా! అని కొంత మంది పరోక్షంగానూ – మరికొంత మంది ప్రత్యక్షంగానూ నారాయణరావు మీద దాడి చేశారు.

నారాయణరావు ఖాతరు చెయ్యలేదు.

'మన ఆచారం మంట కలుపుతున్నావన్నారు' కొంతమంది ఛాందసులు. దానికి నారాయణరావు వేదాంతిలా నవ్వేవాడు. 'ఈ మడీ ఆచారాలూ మనం పెట్టుకున్నవే. మనిషి చనిపోతే పదకొండు రోజులు మైల పాటిస్తారు కొంత మంది. చనిపోయిన మర్నాడే స్నానం చేసి ఇంట్లోకొచ్చేస్తారు కొంతమంది మనం అలా చేస్తే బెడిసి కొడుతుందనుకుంటాం. మరి వాళ్ళకేం కాదేం? కాలం మారుతోంది. వీటితోనే ఆచారాలూ-సంప్రదాయాలూ మారటం అనివార్యం! సంప్రదాయాలు మనిషిని

క్రమబద్ధమైన జీవితంలో నడిపించటానికేగానీ – మన కాళ్ళకి బంధాలు కారాదు! అనేవాడు నారాయణరావు

మరెవ్వరూ నోరెత్తలేకపోయేవారు.

"నువ్వొబండ మూర్ఖుడివి. నీతో వాదన అనవసరం. అందరూ తూర్పున సూర్యుడు ఉదయిస్తాడంటే – నువ్వు పశ్చిమాన ఉదయిస్తాడంటావు. నీ ఖర్మ!" అనేసి వదిలేసారు.

అయితే నారాయణరావు జీవితంలో రెండు గట్టి దెబ్బలు తిన్నాడు. అల్పాయుష్షుతో అర్ధాంగి అర్ధాంతరంగా తనువు చాలించటంగాక!

పెద్దకూతురు మొదటి కాన్పులోనే – కడుపులో బిడ్డ అడ్డం తిరగటంతో – ప్రసవం కాలేక మరణించింది.

ఆ తరువాత కొద్ది సంవత్సరాలకు చిన్నకూతురూ – అల్లుడూ సంపూర్ణ తీర్థయాత్రలకి వెళ్ళి – తిరిగి వస్తుండగా – వీళ్ళొచ్చే ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన ప్రమాదంలో మొత్తం మరణించారు.

దాంతో నారాయణరావు మంచం పట్టేశాడు.

రాత్రులు నిద్రపోయేవాడుకాదు. ఆహార పానీయాలూ సరిగా తీసుకునే వాడు కాదు.

పోలయ్యా – ఎర్రమ్మ అతనికి నచ్చచెప్పి బలవంతంగా తిండి తినిపించేవారు. కూతుళ్ళను తల్చుకుని కృంగిపోయేవాడు. ఈ పరిస్థితుల్లో తండ్రి తన మాట వినడని – కొన్నాళ్ళు ఉద్యోగానికి సెలవు పెట్టుకొని కామేశ్వరరావు సకుటుంబంగా తండ్రి దగ్గరకే వచ్చేశాడు.

ఆ తరువాత కామేశ్వరరావు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. కొడుకూ – తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసేశాడు. కొడుకు రాకతో నారాయణరావు కుదుట పడ్డాడు.

కామేశ్వరరావు కొడుకు ఇల్లు కట్టుకున్నాడు మధ్యప్రదేశ్‌లో. అందర్నీ రమ్మని కోరాడు. నారాయణరావు 'నేనెక్కడికీ రాలేనంటే' తండ్రిని పోలయ్యకి అప్పచెప్పి – పది రోజుల్లో తిరిగి వచ్చేస్తానని వెళ్ళాడు.

పది రోజుల్లో వచ్చేస్తానన్న కొడుకూ, కోడలూ అన్న నాటికి రాలేదు. పదిహేను రోజులు... నెల రోజులు దాటాయి. నారాయణరావు మనసెందుకో కీడును శంకిస్తోన్నంతలో కొడుకు నుంచి ఉత్తరం వచ్చింది.

"ఒరే, ఈ ఉత్తరం చదివి వినిపించరా! నా కళ్ళు సరిగా ఆనటంలేదూ!" అన్నాడు అక్కడే ఉన్న పోలయ్య కొడుకుతో. పోలయ్య కొడుకు ఉత్తరం చదూతున్నవాడల్లా ఆగిపోయాడు. తండ్రిని పక్కకి పిలిచి మెల్లగా విషయం చెప్పాడు. తండ్రీ కొడుకుల గుసగుసలు నారాయణరావులో అనుమానం రేకెత్తించింది.

"ఒరే, పోలీ అబ్బాయేం రాశాడ్రా? ఎప్పుడొస్తాట్ట? ఏంటి? చెప్పరేం?" అన్నాడు.

"అబ్బాయి గోరూ... వచ్చేత్తారండీ... ఆరికేం, బాగానే ఉన్నారండీ" అన్నాడు తడబడుతూ. ఆ తడబాటులో కలవరం కనిపించింది. ఆ కలవరం వెనకాల

చెప్పకూడనిదేదో ఇమిడి ఉన్నట్లు అనిపించింది. ఆ చెప్పకూడని దానిలో జరగకూడనిదేమైనా జరిగిందేమోన్న భయం... బెంగ... నారాయణ రావులో ఎక్కువై "ఆ ఉత్తరం ఇలా ఇవ్వు! పోలీ ఆ కళ్ళద్దాలందుకో!" అన్నాడు నారాయణరావు.

''అబ్బే. అబ్బాయిగోరికక్కడేవో పనులున్నాయట. మరో నెల రోజుల్లో వచ్చేత్తారంట. నన్ను 'ఇంటినీ-మిమ్మల్నీ' జాగర్తగా సూసుకో మన్నారు" అన్నాడు.

"ఉరే. పోలీ నాతో అబద్ధాలాడకు. ఆ ఉత్తరం ఇలాతే. నాది గుండెకాదు. బండరాయి. ఇనుప గుండు. దీనికి సుత్తిదెబ్బలూ... నవ్వెమ్మటపోటు అలవాటయిపోయాయి. భార్యా, పిల్లలూ... అందరూ నన్నొదిలి వెళ్ళిపోయినా... నేనింకా మిగిలి ఉన్నానంటే... నా గుండె ఎంతగట్టిదో ఆలోచించు కానీ - నా కొడుకు... వాడి కళ్ళముందు నేనుపోవాలి. నేను వాడి గురించిన ఏ 'దుర్వార్తా' వినకూడదు వినలేను. ఆ ఉత్తరం ఇటివ్వు" ఆవేదనతో, ఆందోళనతో ఆయాస పడుతూ అన్నాడు నారాయణరావు.

పోలయ్యకు చెప్పక తప్పలేదు. 'కొడుకు గృహప్రవేశానికెళ్ళిన కామేశ్వర్రావు బాత్రూంలో జారిపడిపోతే - కాలు విరిగి, హాస్పిటల్లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు. దెబ్బ పెద్దది కావటంచేత విశ్రాంతి అవసరమని.. హాస్పిటల్లోనే ఉండాలని డాక్టర్లన్నారు.' అదే చెప్పాడు పోలయ్య. అయినా నారాయణరావు ఉత్తరం తీసుకొని చదివాడు. విషయం యదార్థమే. అయితే వాళ్ళు రాసింది 'నిజమా?కాదా?' అన్నదే అతని సందేహం.

బయటకేం అనకపోయినా - దాంతో దిగులు పెట్టుకున్నాడు తిండి మానేశాడు. రెండు రోజుల్లో కోమాలోకి వెళ్ళిపోయాడు. మూడో రోజు లోకం విడిచి వెళ్ళిపోయాడు.

ఫోన్ చేస్తే మనవడొచ్చాడు.

శవ దహనానికి సామగ్రిని సమకూర్చారు. కానీ శవ వాహకులే కనిపించలేదు. కనీసం అయిదుగురు కావాలి. నలుగురు మోతకు. ఒకరు తలకొరివి పెట్టడానికి. నారాయణరావు కులస్తులు. బంధువులూ చుట్టూరా ఉన్నారు.

కానీ -

ఎవరూ ముందుకు రావటంలేదు. ఎవరికి తోచిన సాకులు వాళ్ళు చెప్తున్నారు. నారాయణరావు మేనల్లుళ్ళు ఎట్టకేలకు ముందుకొచ్చారు. ఇంకా ఇద్దరవసరం.

ఎవర్ని పిలిచినా ఏదో కారణం చెపుతున్నారు.

ఒకాయిన - "మొన్ననే కన్యాదానం చేశాను. పదహార్రోజుల పండుగయినా జరగలేదు. లేకపోతే తప్పక మోసేవాణ్ణే" అని తప్పుకున్నాడు.

మరొకాయన 'మళ్ళీ వారమే మా ఇంటపెళ్ళి. శుభకార్యం ముందెట్టుకుని ఈ పనికి పూనుకోకూడదు కదా! లేకపోతే ఇలాటి పట్టింపులు నాకేం లేవు' అని తప్పుకున్నాడు.

నారాయణరావు దూరపుబంధువుకు తప్పని పరిస్థితి అయింది. అతను వరసకు కొడుకే. అతను శతథా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. చివరికి అతనికో మెరపు ఆలోచన వచ్చింది. "మా ఆవిడ గర్భిణి నాలుగోనెల.

లేకపోతే నాకాయన పెద్దనాన్నే, అదెంతో పుణ్యమే" అన్నాడు. అని ఊపిరి పీల్చుకున్నాడు. అంతలో అక్కడే ఉన్న అతని వదిన, "ఏమే, మీ ఆయన ఆపరేషన్ చేసుకుని అయిదు సంవత్సరాలయిందన్నావు. ఇప్పుడు నీకు కడుపేంటి! ఎక్కడైనా... ఎంగిలి పడ్డావా?" అని కిసుక్కున నవ్వింది నోట్లో ఏమిటో పెట్టుకుని.

"ఇదిగో, అక్కా! మాటలు మర్యాదగా రానీ. అలాటి వెధవ పనులు నీకలవాటేమోగానీ.. నా కలవాటు లేదు" అంది గయ్యమని లేచి.

అప్పుడక్కడ కలకలం బయలుదేరింది. చిలికి చిలికి గాలివానయింది. తెరవెనుక డైలాగులు వీడియోటేపుల్లా వినోదించాయి.

నారాయణరావు మనవడు అసహనంగా తిరుగుతున్నాడు.

ఇంతలో ఎవరో సలహా ఇచ్చారు. పక్క ఊళ్ళో శవవాహకులు కిరాయికి దొరుకుతారని, వాళ్ళకి కబురు పెట్టేందుకు మనుషులను పురమాయించబోతున్నంతలో - వాళ్ళకెలా తెలిసిపోయిందో వాళ్ళేవచ్చారు. మనిషికి వెయ్యి రూపాయిలడిగారు. నారాయణరావు మనవడు వాళ్ళతో బేరాలకి దిగదలచుకోలేదు.

"పని కానీండి. ఎండమాడుస్తోంది. మరో గంట ఇక్కడే ఉంటే శవదహనానికి నిప్పుతో పనే ఉండకపోవచ్చు" అన్నాడు.

వాళ్ళు కార్యక్రమానికి సమాయత్తం కాబోతుండగా "బాబూ! నీ దగ్గర డబ్బులున్నాయి. ఇచ్చేస్తావు. రేపో పేదవానికిదే పరిస్థితెదురైతే వాళ్ళేం కావాలి? ఏమయ్యా! ఆ 'సోమయ్య' గార్ని మొన్న మోసుకెళ్తే మనిషి కెంతిచ్చారు? నూటయేభయ్యి! ఇవాళ వెయ్యి కావాలి!? ఆశకి హద్దుండాలి!" అని అడ్డు పడ్డాడు. ఓ పెద్దాయన.

'నిజం! అంటే 'నిజం' అన్నారంతా.

''సరే. ఆ నూట యేభయ్యీ మీరేతీసుకొని మోసుకెళ్ళండి" అని వాళ్ళు వెనక్కి తిరక్కుండా వెళ్ళిపోయారు.

నారాయణరావు మనవడు తలపట్టుకున్నాడు.

'అయ్యా! మీ అందరికీ నమస్కారం. మా తాతగారు పరమ ధార్మికులు. ఉపకారం చెయ్యటమేగానీ అన్యం ఎరుగరు. కొడుకు ఉండీ రాలేని పరిస్థితిలో అతను ఉన్నారు. మీకు మేమేం అపకారం చేసాం? ఈ సంప్రదాయాలూ...ఆచారాలపై ఆయనకి నమ్మకం లేదు. నేను తలకొరివి పెడతాను. మరొక్కరు సాయం చేసి పుణ్యం కట్టుకోండి" అని చేతులెత్తి నమస్కరించి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

అసలే వేసవేమో... నేల పొగలు కక్కుతోంది.

గొంతుకలు ఆర్చుకుపోతున్నాయి.

"బాబూ! ఈ సెర్లిం (శరీరం) సెప్పులు కుట్టినా... ఆ బాల్ సేసిన ఉపకారానికి సాలదు. నీనొట్టుకుంటాను. పదండి" అన్నాడు పోలయ్య. నారాయణ రావు మనవడు నిప్పుల ఉట్టితో ముందు నడువబోతుంటే- "ఆగండి బాబూ! ఆడది తలకొరివి పెట్టేందుకు అర్హతలేనిదని ఉందో, లేదో నాకు తెలీదు. నేను తలకొరివి పెడతాను. నడవండి అందోస్త్రీ. ఆమె భర్త అడ్డుకు న్నాడు. ఆమె కాళిక అయింది. ఆమె ఇందాక నా 'భార్య గర్భిణి' అని అబద్ధం ఆడిన అతని భార్య. భర్త వెనక్కి తగ్గాడు. శవం ముందుకు నడిచింది. అందరి నోళ్ళు పిడచకట్టుకు పోయాయి. అప్పుడే రాజుకుం అగ్గి!

...జిక్ చేస్తూ చిన్నారి రసజ్ఞ

పిట్ట కొంచెం మేజిక్ ఘనం

'పిట్ట కొంచెం కూత ఘనం' అన్న సామెతను నిజం చేస్తూ చదువుతోపాటు అతి పిన్న వయసులోనే తను నేర్చుకున్న మేజిక్ ద్వారా సమాజంలోని మూఢవిశ్వాసాలను పారద్రోలే ప్రయత్నం చేస్తూ సీనియర్ ఇంద్రజాలికుల్ని సైతం అబ్బురపరుస్తోంది చిన్నారి 'రసజ్ఞ'. మాయలు మంత్రాలంటూ అమాయక ప్రజల్ని మోసంచేసే దొంగస్వాములనుండి మూఢ విశ్వాసాలను ప్రబలంగా నమ్మే ప్రజలను చైతన్యవంతం చేయడమే తన మ్యాజిక్ ప్రధాన ఉద్దేశమనే ఈ చిన్నారి మెజీషియన్ గురించి ఈ వారం తెలుసుకుందాం.

రసజ్ఞ డాన్స్ ప్రదర్శన

చదువు.. ఆట..పాటలు

1992 సంవత్సరంలో సెప్టెంబర్ 3న విజయవాడ నగరంలో జన్మించిన రసజ్ఞ, తన తల్లితండ్రులైన నిమిషకవి శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మీదేవి ప్రోత్సాహంతో తన ఎనిమిదవ ఏటనే 'ఇంద్రజాల' ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించింది. ప్రధానంగా ఇంద్రజాల ప్రదర్శనలే ఇస్తున్నప్పటికీ భరతనాట్యం, కూచిపూడి, జానపదం, లలిత సంగీతం తదితర సంప్రదాయ కళల్లో కూడా రసజ్ఞ రాణిస్తూవుండటం విశేషం. ప్రస్తుతం విజవాడ 'ఎట్‌కిన్‌సన్' స్కూల్లో 5వ తరగతి చదువుతున్న రసజ్ఞ చదువులోనూ ప్రధమ ర్యాంకులో నిలుస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది. భగవద్గీత శ్లోకాలను శ్రావ్యంగా పాడగలిగే రసజ్ఞ చక్కని సంభాషణా చాతుర్యంతో కూడా ఆకుట్టకుంటుంది.

వయసుకు చిన్న ప్రదర్శనల్లో పెద్ద

గత మూడేళ్లుగా సుమారు 200 పైగా ప్రదర్శనలిచ్చిన రసజ్ఞ అనేక సంస్థల ద్వారా సత్కారాలు, చిరు సన్మానాలు అందుకుంది. సిభార్, వి.యం.సి డిస్నీలాండ్‌లోని గోకులం విభాగంలో డైలీ కార్యక్రమాల్లో పాల్గొని సినీ దర్శకులు కె.విశ్వనాథ్ నుంచి అభినందనలు అందుకుంది. ఏపి మేజిక్ అసోసియేషన్ ఫెస్టివల్, అలాగే కృష్ణా ఉత్సవాలు, క్రాఫ్ట్ బజార్, ఫన్ క్లబ్, చైతన్య ఆర్ట్ థియేటర్స్, కళాదర్శిని తదితర ప్రతిష్టాత్మక సంస్థల కార్యక్రమాల్లో మేజిక్ ప్రదర్శనలు చేసి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

ధైర్యే సాహసే 'రసజ్ఞ'

ప్రేక్షకులకు వినోదాన్ని అందించే మ్యాజిక్ ప్రదర్శనల్లో ప్రమాదకరమైన అంశాలు కూడా రసజ్ఞ ఎంతో ధైర్యంగా చేస్తూ వుంటుంది. మహారాష్ట్రలోని పూణె నగరంలో ఇచ్చిన ప్రదర్శనే దీనికి నిదర్శనం. ప్రేక్షకుడిని వేదికపైకి పిలిచి అతని కళ్ళకు గంతలు కట్టి, తలపై బట్ట పరచి కిరసనాయిల్ పోసి మంటపెట్టి ఆ మంట సాయంతో కమ్మని టీ తయారు చేసిన రసజ్ఞ మ్యాజిక్ ప్రదర్శనకు వందలాది ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో తమ అభినందనలను వ్యక్తం చేసారు. ఒక పక్క చదువులో ప్రతిభ చూపుతూనే మరోపక్క అనేక కళల్లో కృషిచేస్తూ రాణిస్తున్న రసజ్ఞ చిన్నారులందరికీ మార్గదర్శకమే. కళాద్వారా సామాజిక చైతన్యానికి కృషి చేయాలనే లక్ష్యంతో పయనిస్తున్న చిన్నారి రసజ్ఞ భవిష్యత్‌లో విశిష్ట మహిళా మేజీషియన్‌గా ప్రపంచ ప్రఖ్యాతి పొందాలని కోరుకుందాం.

✻ చలపాక ప్రకాష్

స్నేహమాధుర్యపు పలకరింపు 'వసంత కోకిల'



వసంత కోకిల
రచన : అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి,
వెల : రూ.50/-;
ప్రతులకు ఇ.నెం.4-9-618,
వినాయక్‌నగర్‌కాలనీ, హయత్ నగర్,
రంగారెడ్డి జిల్లా.

ఓ కథ రాయాలంటే వస్తువుకోసం వెతుక్కోడం ఓ పెద్ద పని... నిజానికి కథా వస్తువు వెతుక్కోవాలా? వెతుక్కుంటే లభిస్తుందా? లేదంటే కళ్ళు మూసుకుని, ఏకాంతంగా కూర్చుని ఆలోచిస్తుంటే లభిస్తుందా? లేక ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తుంటే లభిస్తుందా? ఈ ప్రశ్నలన్నిటికీ కాదు అని ఘంటాపథంగా చెబుతూ అల్లూరి గౌరీలక్ష్మి రాసిన కథలే "వసంత కోకిల" కథా సంకలనంలో చోటు చేసుకున్నాయి.

తన చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచి, పరిసరాల నుంచి, జరిగిన సంఘటనల నుంచి యథాలాపంగా వస్తువు తీసుకుని అలవోకగా రాశారు గౌరీలక్ష్మి. ఆమె శైలిలో సున్నితత్వం అక్కడక్కడా చిరుజల్లులా తాకి ఆహ్లాదాన్ని కలిగించే హాస్యం పాఠకులను అలరిస్తాయి... అన్ని కథల్లోనూ ఓ తీయని స్నేహ మాధుర్యాన్ని చిలకరించే పాత్రలు మనల్ని పలకరిస్తాయి. వసంత కోకిల కథలో స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే ఆకర్షణ, సాన్నిహిత్యం అనుబంధం కేవలం శారీరక సంబంధానికి దారి తీసేవే అనే అపోహతో బతికే ఎందరికో, స్త్రీ పురుషుల స్నేహంలో మనసుని తట్టి లేపే ఓ తీయని స్నేహం ఉంటుందని తెలియజేస్తుంది.

అలాగే ఈమె రాసిన స్టేటస్ సింబల్ కథ చదివితే, పెద్దమ్మ లాంటి ఎన్ని పాత్రలు నిజజీవితంలో తారసపడినా, జాలిపడో, చిరాకు పడో మర్చిపోకుండా ఇలాంటి వ్యక్తుల చుట్టూ ఓ మంచి కథ అల్లచ్చుని, తద్వారా అంతర్గతంగా దాగి ఉండే హిపోక్రసీని బైటపెట్టవచ్చని తెలియచేస్తుందీ కథ.

వ్యక్తుల మనస్తత్వాలు సందర్భానుసారంగా ఎలా మారుతుంటాయో, ఆ మార్పును ఎంత చక్కగా, చాకచక్యంగా తమకు అనుకూలంగా స్వీకరించగలరో తెలియచేసే కథ కొండవాగు.

అమ్మంటే ఎంతో ఉదాత్తమైన వ్యక్తిగా చిత్రించాలి అన్న అపోహని పటాపంచలు చేస్తూ ఇద్దరు స్నేహితురాళ్ళు తమ తమ ప్రేమగాథల్ని వారి తల్లులు ఎలా స్వీకరించి, స్పందించారో దాని వలన తమ జీవితాలు ఎలా అయ్యాయో బాధపడుతూ తల్లిని ద్వేషించే పాత్రలుగా తీర్చిదిద్దే సాహసం చేశారు ఫ్యూపాయింట్ కథలో.

అలాగే అమ్మ మనసులోని ప్రేమానురాగాలనూ, త్యాగ గుణాన్ని, పిల్లల కోసం తనను తాను కొవ్వొత్తిలా కాల్చుకునే అమ్మతనాన్ని, ఆ అమ్మతనాన్ని తమ స్వార్థం కోసం కొల్లగొట్టే పిల్లల నైజాన్ని ఎంతో హృద్యంగా ఆవిష్కరింప చేశారు 'అమ్మతనం' కథలో..

ఇష్టం లేని పెళ్ళి చేసి... అందులోనే ఆనందాన్ని వెతుక్కోమని శాసించిన అనగారి నిరంకుశత్వాన్ని ఎదిరించి, నచ్చిన వాడితో వెళ్ళిపోయి హాయిగా బతుకుతూ, తను చేసింది తప్పు కాదని వదిన గారి నోటి ద్వారా విని ఆనందపడుతుంది స్వయంవరం కథలో కథానాయికి.

పరిస్థితులు వికటించి అనుకున్నది సాధించలేక పెద్ద మనిషి ముసుగు వేసుకుని తానేదో గొప్ప ఉదాత్తుడననే భావం కలిగించడానికి తాపత్రయపడి అమాయకురాలి మనసుగెల్చుకున్న ది హిపోక్రైట్ కథ "ముసుగు". గౌరీలక్ష్మిది సరళమైన శైలి. సున్నితమైన హాస్యం, తీయని స్నేహంతో కూడిన పాత్రల చిత్రీకరణ ఈమె ప్రత్యేకతలు.

భవిష్యత్తులో గౌరీలక్ష్మి మంచి రచయిత్రిగా మరిన్ని మంచి కథలు రాయాలని, రాస్తారని ఆశిస్తున్నాను.

❋ విజయ

శ్రీకారం

ఏ మాన్యువల్ ఆఫ్ సప్లిమెంటరీ ఫీడింగ్
రచన : డా॥ కర్రా రమేష్ రెడ్డి; వెల : రు.20/-
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాద్; పారస్ మెడికల్ పబ్లిషర్, 5-1-473, పుత్లిబౌలి, పి.బి.నెం.544, హైదరాబాద్



చుక్క పొద్దు
రచన : జి.మాల్యాద్రి; వెల : రు.20/-; ప్రచురణ : సాహితీ మిత్రులు, కైకలూరు, కృష్ణాజిల్లా; ప్రతులకు : జి.మాల్యాద్రి, యమ్.పి.యు.పి.స్కూల్, చినతాడినాడ, కలిదిండి మండలం, కృష్ణాజిల్లా - 521 333; జి.నరసయ్య, 2వ వార్డు, అవనిగడ్డ - 521 121; చింతపల్లి వెంకట నారాయణ, కన్నీవరు, సాహితీ మిత్రులు, కైకలూరు, కృష్ణాజిల్లా.



ప్రపంచ భాషలు
రచన : డాక్టర్ వెలమల సిమ్మన్న; ప్రచురణ : దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం; వెల : రు.70/-; ప్రతులకు : శ్రీమతి వి.పార్వతి, 4-39-12/3, మునిసిఫ్ వారి వీధి, పెదవాల్తేరు, విశాఖపట్నం - 17